క్లుప్తంగా

ఆర్థిక సాయం



ఎల్లారెడ్డిపేట: అక్కపల్లికి చెందిన నేదూరి లక్ష్మి రాజం కొంతకాలంగా మూత్ర పిండాల వ్యాధితో బాధపడుతుండగా.. బాధితుడికి వైద్య ఖర్చుల కోసం బీజేపీ గ్రామ శాఖ నాయకులు మంగళవారం రూ.10వేల ఆర్థిక సాయం చేశారు.

100 మందికి అన్నదానం



వేములవాడ: వేములవాడ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం వంద మంది పేదలకు అన్నదానం చేశారు. దాతల సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో 1,134 రోజులుగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ సభ్యులు పాత సంతోష్, మహమ్మద్ రఫీక్, పాలాస రాజేందర్, ప్రతాప నటరాజ్, పసుల శ్రీనివాస్, నంది సాయి, నక్క వేణు, గుమ్మడి కుమార్, పిన్నింటి హన్మండ్లు, పిట్టల రాజు తెలిపారు.

పాలిటెక్నిక్‌లో ఎల్లారెడ్డిపేట విద్యార్థికి 191వ ర్యాంక్



రిశ్వంత్‌ను సన్మానిస్తున్న కరస్పాండెంట్ లతీఫ్

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రానికి చెందిన చింత రిశ్వంత్ అనే విద్యార్థి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో 191వ ర్యాంక్ సాధించాడు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన పాలిసెట్ ఎంట్రన్స్‌లో రిశ్వంత్ 120 మార్కులకు గాను 112 తెచ్చుకున్నాడు. ఎల్లారెడ్డిపేటలోని విజ్ఞాన్ ఇంగ్లిష్ పాఠశాలలో చదివిన రిశ్వంత్ పదోతరగతిలో 10జీపీఏ పొందాడు. తండ్రి చింత రాజు జనరల్ స్టోర్ పెట్టుకొని వ్యాపారం చేస్తూ కుమారుడిని చదివిస్తున్నాడు. తల్లిదండ్రుల కల సాకారం చేసేందుకు నిరంతరం కష్టపడి చదివి ఈ ర్యాంక్ సాధించడం ఆనందంగా ఉందని రిశ్వంత్ తెలిపాడు. కరస్పాండెంట్ లతీఫ్, ప్రిన్సిపాల్ శరత్‌కుమార్ సత్కరించి అభినందించారు.

అగ్గిని జయించి.. ఆపై చిగురించి!



ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయిన తాటి చెట్లు



వర్షాలు కురవడంతో తిరిగి చిగురిస్తున్న తాటి చెట్లు

- తాడూర్‌లో తాటివనంలో ఇటీవల అగ్ని ప్రమాదం
- పూర్తిగా కాలిపోయిన తాటి చెట్లు
- ఆశలు వదులుకున్న గీత కార్మికులు
- అగ్గిని జయించి చిగురిస్తున్న వైనం

తంగళ్లపల్లి: గౌడన్నలకు తాటి, ఈత చెట్లే జీవనాధారం. అలాంటిది.. ఏళ్లుగా కష్టపడి పెంచిన తాటివనం అగ్నికి ఆహుతి అయితే వారి పరిస్థితి అగమ్యగోచరంగా తయారవుతుంది. మండలంలోని తాడూర్ గ్రామం ఎల్లమ్మ ఆలయ ప్రాంతంలో గీత కార్మికులకు సుమారు 250 చెట్లతో తాటివనాన్ని గత 20 ఏళ్లుగా పెంచుతున్నారు. ఆ చెట్లపైనే ఆధారపడి వారి కుటుంబాలను పోషించుకుంటున్నారు. కానీ ఒక్కసారిగా అగ్ని ప్రమాదం జరగడంతో తాటివనం దగ్ధమైంది. దీంతో వారు కన్నీరుమున్నీరయ్యారు. చెట్లన్నీ కాలిపోయి బొగ్గులా మారడంతో జీవనాధారం లేకుండా పోయిందని భావించారు. కానీ ఇటీవల కురిసిన వర్షాలు గౌడన్నల మోముల్లో సంతోషాన్ని తిరిగి తెచ్చాయి.

చెట్లన్నీ ఆహుతి..

ప్రమాదవశాత్తు జరిగిన అగ్నిప్రమాదంతో తాటివనంలోని సుమారు 250 తాటి చెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. వెంటనే ఫైరింజన్ ద్వారా మంటలు ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ అప్పటికే చెట్లన్నీ కాలిపోయాయి. కేవలం పదుల సంఖ్యలో చెట్లను మాత్రమే అగ్నిమాపక శాఖ సిబ్బంది కాపాడగలిగారు. చెట్లు కాలిన ప్రాంతంలో వెలువడిన వేడి వారంరోజులపాటు అలాగే ఉంది. అంటే ఎంత పెద్ద ఎత్తున మంటలు ఎగిసిపడ్డాయో అర్థం చేసుకోవచ్చు.

అండగా ఉంటామని ధైర్యం చెప్తూ..

తాడూర్ గ్రామంలో 250 వరకు తాటిచెట్లు అగ్ని ప్రమాదానికి దగ్ధమయ్యాయని తెలియడంతో అదే రోజు సిరిసిల్ల పర్యటనలో ఉన్న మంత్రి పొన్నం ప్రభాకర్ తాడూర్ చేరుకున్నారు. అధైర్యపడొద్దని, ప్రభుత్వం తరఫున అండగా ఉంటామని వారికి భరోసా కల్పించారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కాలిన తాటివనాన్ని పరిశీలించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ గ్రామంలోని గౌడ్‌లకు ధైర్యం చెప్పారు. పొట్టి తాటిచెట్ల విత్తనాలను తెప్పించి ఉచితంగా పంపిణీ చేస్తానని హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్ సైతం తాడూర్ వచ్చి గౌడ కులస్తులతో మాట్లాడారు.

వర్షాలతో మళ్లీ చిగురు..

ఇక తాటి వనం దక్కదు అనుకున్న గీత కార్మికులకు వర్షాలు పడుతుండటంతో మళ్లీ చెట్లు చిగురిస్తున్నాయి. కాలిపోయి బొగ్గులా మారిన తాటి చెట్లు ఇటీవల కురిసిన వర్షాలకు తిరిగి పచ్చదనాన్ని సంతరించుకుంటున్నాయి. దీంతో గౌడన్నల మోములో సంతోషం కనిపిస్తోంది. చెట్లపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపితే తిరిగి మాములు స్థితికి చేరుకుంటాయని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

ప్రత్యేక శ్రద్ధ చూపాలి



తాటి చెట్లు కాలిపోయి మళ్లీ చిగురించడం ఆనందంగా ఉంది. సరైన సమయానికి వర్షాలు కురవడంతో చెట్లు మళ్లీ చిగురిస్తున్నాయి. అయితే వాటిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. చెట్ల ఎదుగుదలకు ప్లానోఫిక్స్ 100ఎంఎల్, ఎన్‌పీకే 19:19:19 చెట్లకు అందిస్తే ఎప్పటిలాగే మారే అవకాశం ఉంది.

– సందీప్‌కుమార్, వ్యవసాయాధికారి, తంగళ్లపల్లి

రోడ్లు నిర్మానుష్యం

- టీవీలు, మొబైళ్లకు అంకితమైన జనం





వేములవాడలో బోసిపోయిన రోడ్డు, వేములవాడలో ఎన్నికల ఫలితాలను తమ మొబైల్‌లో చూస్తూ..

వేములవాడ: పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో ఓట్ల లెక్కింపు మంగళవారం ఉదయం నుంచే ప్రారంభం కాగా.. జనం తమతమ ఇళ్లలో టీవీలు, మొబైళ్లకు అంకితమయ్యారు. దీంతో వేములవాడలోని రోడ్లన్నీ వెలవెలబోయి కనిపించాయి. ఒకరిద్దరు ఎవరు కలిసినా రాష్ట్ర, దేశవ్యాప్త, ఆంధ్రప్రదేశ్ ఎన్నికలపై చర్చించుకున్నారు.

ఆసక్తిగా ఫలితాల వీక్షణ..



ఎన్నికల ఫలితాలను టీవీలో చూస్తున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మంగళవారం జరిగిన పార్లమెంట్ ఎన్నికల లెక్కింపు ఫలితాలను తన నివాసంలో అనుచరులతో కలిసి టీవీలో ఆసక్తిగా వీక్షించారు.

మద్యం అమ్మకాలపై ఎక్సైజ్ దాడులు



పట్టుకున్న మద్యంతో ఎక్సైజ్ సీఐ ముస్తాఫా

బోయినపల్లి(చొప్పదండి): లోక్‌సభ ఎన్నికల ఫలితాల వేళ వైన్స్ షాపులు బందున్న సమయంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మండలంలోని రెండు గ్రామాల్లో సిరిసిల్ల ఎక్సైజ్ సీఐ గులాం ముస్తాఫా ఆధ్వర్యంలో దాడులు చేసి మంగళవారం మద్యం పట్టుకున్నారు. సీఐ వివరాల ప్రకారం.. కోరెం, వెంకట్రావుపల్లి గ్రామాల్లో మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చింది. ఎక్సైజ్ సిబ్బందితో కలిసి గ్రామాల్లో దాడులు నిర్వహించి మద్యం పట్టుకున్నారు. విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై ప్రణీత్‌గౌడ్, హెడ్ కానిస్టేబుల్ మాజిద్, సిబ్బంది మధు, జి.శ్రీను, ఎ.శ్రీను తదితరులున్నారు.

అర్బన్ బ్యాంకు ఎన్నికల ప్రచారంలో తంగళ్లపల్లి నాయకులు



సిరిసిల్లలో ప్రచారం చేస్తున్న నాయకులు

తంగళ్లపల్లి: సిరిసిల్ల అర్బన్ బ్యాంకు ఎన్నికల ప్రచారంలో తంగళ్లపల్లి మండల బీఆర్‌ఎస్ నాయకులు మంగళవారం పాల్గొన్నారు. 4వ డివిజన్ డైరెక్టర్‌గా బీఆర్‌ఎస్ బలపరిచిన అభ్యర్థి అడ్డగట్ల మురళిని గెలిపించాలని స్థానిక కౌన్సిలర్లతో కలిసి ఓటర్లను అభ్యర్థించారు. సిరిసిల్ల సింగిల్విండో వైస్ చైర్మన్ ఎగుమామిడి వెంకటరమణారెడ్డి, సీనియర్ నాయకుడు పడిగెల రాజు, స్థానిక మున్సిపల్ కౌన్సిలర్లు అన్నారపు శ్రీనివాస్, లింగంపల్లి సత్యనారాయణ, పోచవేని సత్య ఎల్లయ్యయాదవ్, జాగృతి మండల అధ్యక్షుడు కందుకూరి రామాగౌడ్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలం సీజన్‌కు విత్తనాలు సిద్ధం

- దుక్కుల పనుల్లో రైతులు
- 17,500 ఎకరాల్లో వరి.. 4,500 ఎకరాల్లో పత్తి



అందుబాటులో ఎరువులు, విత్తనాలు

ఎల్లారెడ్డిపేట: వానాకాలం సీజన్‌కు వ్యవసాయ అధికారులు ఎరువులు, విత్తనాలను సిద్ధం చేశారు. రోహిణి కార్తె షురూ కావడంతో అన్నదాతలు దుక్కులను చదును చేసే పనిలో నిమగ్నమయ్యారు. అప్పుడప్పుడు కురిసిన వర్షాలతో నేల తడిసిపోగా.. అన్నదాతలు విత్తనాలు నాటేందుకు దుక్కులను సిద్ధం చేసుకున్నారు. ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాల పరిధిలో ఈ సీజన్‌లో 17,500 ఎకరాల్లో వరి, 4,500 ఎకరాల్లో పత్తి వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. 4,200 క్వింటాళ్ల వరి విత్తనాలు, 15వేల పత్తి ప్యాకెట్లు అవసరం ఉండగా.. ఇప్పటికే 9వేల పత్తి ప్యాకెట్లు, 850 క్వింటాళ్ల వరి విత్తనాలను అధికారులు అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం విత్తనాలు, ఎరువులను ఎల్లారెడ్డిపేట, రాచర్లగొల్లపల్లి, వెంకటాపూర్‌లోని ప్రైవేట్ డీలర్ల వద్ద నిల్వ చేశారు. నకిలీ విత్తనాలపై అధికారులు రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. విత్తన దుకాణాలపై నిత్యం నిఘా ఉంచుతూ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

పంటల దిగుబడికి కార్తె కీలకం

పంటలను విస్తారంగా సాగు చేసి అధిక దిగుబడులు సాధించడానికి మృగశిర కార్తెను అన్నదాతలు కీలకంగా భావిస్తారు. ఆ కార్తెలోనే పూర్తి స్థాయిలో పంటలు వేయడానికి ఆసక్తి చూపుతారు. ప్రస్తుతం అదే కార్తె కొనసాగుతుండడంతో.. రైతులు దుక్కులు సిద్ధం చేసి విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసి అందుబాటులో ఉంచుకుంటున్నారు. జూన్ మొదటి వారంలోనే తొలకరి వర్షం కురుస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. తొలకరి జల్లులు పడిన వెంటనే విత్తనాలను నాటేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. సుమారు 50 నుంచి 60 మిల్లీమీటర్ల వర్షం కురిసిన తరువాతే విత్తనాలను పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. ఆ స్థాయిలో వర్షపాతం నమోదైతే నేల చల్లబడి తడితో ఉండి నాటిన విత్తనాలు మొలకెత్తే అవకాశం ఎక్కువగా ఉంటుందని, మోతాదు స్థాయిలో వర్షం పడకుంటే నేల తడిగా ఉండి విత్తనాలు మొలకెత్తే అవకాశం తక్కువగా ఉంటుందని అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రస్తుతం ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తెచ్చినా.. మృగశిర కార్తెలోనే పంటలు సాగు చేయాలని రైతులు కూడా ఆ దిశగా ముందుకు పోతున్నారు.

ప్రైవేట్ దుకాణాల్లో విత్తనాలు

ఈ సీజన్‌లో లక్ష్యం ప్రకారం ప్రైవేట్ డీలర్లు విత్తనాలు, ఎరువులను సిద్ధం చేసుకున్నారు. అధికారులు దుకాణాల్లో డీలర్లు నిల్వ చేసిన స్టాక్‌ను పరిశీలించి సీజన్‌కు ఏ మోతాదులో ఏం అవసరం ఉంటాయో అనే దానిపై డీలర్లకు సూచనలు చేస్తున్నారు. దీనికి తోడు ప్రైవేట్ డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేసే రైతులు తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. నాసిరకం విత్తనాలు రైతులు అంటగడితే చర్యలు తీసుకుంటామని పేర్కొంటున్నారు. ఏదేమైనా ఈ సీజన్‌లో రైతులకు సరిపడేలా ముందుస్తుగానే ఎరువులు, విత్తనాలను అందుబాటులోకి తెచ్చారు.

విత్తనాలు అందిస్తున్నారు..



ఈ సీజన్‌లో ముందుగానే విత్తనాలను డీలర్ల వద్ద రైతులు కొనుగోలు చేస్తున్నారు. ఎంత విస్తీర్ణంలో పంటలు వేస్తారనేది ముందుగానే అధికారులు అంచనా వేసుకొని ఆ స్థాయిలో విత్తనాలను సిద్ధం చేయడం రైతులకు లాభసాటిగా ఉంది.

– మోతే మధుసూదన్‌రెడ్డి, రైతు, నారాయణపూర్

వర్షం పడితేనే నాటాలి



మృగశిర కార్తె ప్రారంభంలోనే తొలకరి జల్లులు కురిసిన వెంటనే రైతులు విత్తనాలు నాటాలి. సుమారు 50 నుంచి 60 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిన తరువాత విత్తనాలు నాటితే అన్నీ మొలకెత్తే అవకాశం ఉంటుంది.

– చాడ భూంరెడ్డి, వ్యవసాయ అధికారి, ఎల్లారెడ్డిపేట



సిరిసిల్లటౌన్: గాంధీచౌక్‌లో బీజేపీ నాయకుల సంబరాలు



నాంపల్లిలో బీజేపీ నాయకుల సంబరాలు



ఎల్లారెడ్డిపేటలో బాణసంచా కాలుస్తున్న నాయకులు

బీజేపీ సంబరాలు

సిరిసిల్లటౌన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించగా.. గాంధీచౌక్‌లో మంగళవారం రాత్రి నాయకులు టపాసులు పేల్చి స్వీట్లు పంచారు. పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పార్లమెంట్ కోకన్వీనర్ ఆడెపు రవీందర్, గాజుల వేణు, మోర రవి తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటుకు స్పష్టమైన మెజార్టీ రావడం, కరీంనగర్ ఎంపీగా రెండోసారి బండి సంజయ్‌కుమార్ గెలుపొందడంపై ఆ పార్టీ శ్రేణులు స్థానిక పాత బస్టాండ్‌లో బాణసంచా కాల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. మండల అధ్యక్షుడు పొన్నాల తిరుపతిరెడ్డి, నాయకులు చందుపట్ల లక్ష్మారెడ్డి, సత్యంరెడ్డి, దాసరి గణేశ్, బందారపు లక్ష్మారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నంది నరేశ్, మానుక కుమార్‌యాదవ్ తదితరులున్నారు.

వీర్నపల్లి: మండల కేంద్రంతోపాటు మండలంలోని అన్ని గ్రామాల బీజేపీ కార్యకర్తలు, అభిమానులు మంగళవారం సంబరాలు చేసుకున్నారు. బండి సంజయ్ ఎంపీగా విజయం సాధించిన సందర్భంగా మండల అధ్యక్షుడు దేవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. మాజీ మండల అధ్యక్షుడు బోడ మల్లేశం, నాయకులు ప్రకాశ్, పీర్యా, లక్పతి, మహేశ్, నరేశ్, వెంకటేశ్, ప్రశాంత్ తదితరులున్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మున్సిపల్ పరిధి నాంపల్లి చౌరస్తా వద్ద బీజేపీ నాయకులు మంగళవారం సాయంత్రం టపాసులు కాల్చి సంబరాలు జరుపుకున్నారు. కరీంనగర్ బీజేపీ ఎంపీగా బండి సంజయ్ రెండోసారి గెలుపొందడంతో సంబరాలు అంబరాన్నంటాయి.

తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి బీజేపీ మండల అధ్యక్షుడు వెన్నమనేని శ్రీధర్‌రావు ఆధ్వర్యంలో సంబరాలు జరిపారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం ఎదుట స్వీట్లు పంపిణీ చేశారు. నాయకులు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి స్వీట్లు పంచి పెట్టారు. మండల అధ్యక్షుడు గుడి రవీందర్‌రెడ్డి, నాయకులు ఉదారి నర్సింహాచారి, క్యాతం తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండల కేంద్రంతోపాటు అన్ని గ్రామాల్లో బీజేపీ నాయకులు సంబరాలు జరుపుకున్నారు. జిల్లా కార్యదర్శి గోపాడి సురేందర్‌రావు, మండల అధ్యక్షుడు గొట్టె రామచంద్రం ఆధ్వర్యంలో టపాసులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. బైరగోని సురేశ్, బెంద్రం శ్రీనివాస్‌రెడ్డి, వెలిశాల రవి, బొల్లారం తిరుపతి పాల్గొన్నారు.

నాలుగు వరుసల రహదారికి మోక్షమెప్పుడో?

- కొదురుపాక వంతెన నుంచి నంది కమాన్ వరకు పూర్తి కాని ఫోర్‌వే లైన్
- వరుసగా రోడ్డు ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నాంపల్లి శివారులో లారీ, వ్యాన్ ఢీ(ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న దర్శనానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వాహనాల ద్వారా నిత్యం అధిక సంఖ్యలో వస్తుంటారు. వేములవాడకు రహదారులు ఎప్పుడు రద్దీగానే ఉంటాయి. రాత్రి, పగలు తేడా లేకుండా వాహనాలు నడుస్తుంటాయి. దీంతో ఈ రహదారుల వెంట ప్రతిరోజు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రహదారిపై వాహనాల మీద వెళ్లాలంటే ఈ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు జంకుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని నిత్యం వందలాది వాహనాలు నడిచే ఈ రహదారిని ఫోర్‌వే లైన్ రహదారిగా ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

వందలాది వాహనాలు..

కరీంనగర్–సిరిసిల్ల ప్రధాన రహదారికి నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా వందలాది వాహనాలు నడుస్తుంటాయి. ఈ ప్రధాన రహదారి కరీంనగర్ నుంచి కొదురుపాక వరకు ఫోర్‌వే లైన్ రహదారి పనులు పూర్తి దశకు చేరుకున్నాయి. సిరిసిల్ల నుంచి వేములవాడ వరకు కూడా ఫోర్‌వే లైన్ రహదారి పూర్తయింది. కేవలం కొదురుపాక మిడ్ మానేరు వంతెన నుంచి వేములవాడ నంది కమాన్ వరకు డబుల్ రోడ్డు మాత్రమే ఉంది. వాహనాల రద్దీతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. మిగిలిన మిడ్ మానేరు వంతెన నుంచి నంది కమాన్ వరకు ఫోర్‌వే లైన్ రహదారి పూర్తి చేస్తే రోడ్డు ప్రమాదాలు తగ్గుతాయి.

ఇటీవల జరిగిన ప్రమాదాలు

కొదురుపాక నుంచి వేములవాడ నంది కమాన్ వరకు చాలా రోడ్డు ప్రమాదాలు జరిగాయి. 6నెలలుగా మృతిచెందిన వారిలో వేములవాడ మండలం చీర్లవంచ గ్రామానికి చెందిన ముద్రకోల దేవరాజు(21) అనే యువకుడు ఆరెపల్లి శివారులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. రుద్రవరం గ్రామానికి చెందిన పాముల పర్శరాములు(55) అనుపురం శివారులో రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. 5 రోజుల క్రితం నాంపల్లి శివారులో లారీ, వ్యాన్ ఎదురెదురుగా ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో సిరిసిల్ల పట్టణానికి చెందిన తాటిపెల్లి బాపురెడ్డి(63) అనే వ్యాన్ డ్రైవర్ మృతిచెందాడు. చిన్న రోడ్డు ప్రమాదాలతో గాయపడిన వారు చాలామంది ఉన్నారు. నిత్యం ఈ రహదారిలో ఏదో ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోందని స్థానికులంటున్నారు.

నిత్యం రద్దీగా ఉంటుంది



కరీంనగర్–సిరిసిల్ల రహదారి నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రతిరోజు ఏదో ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని ఈ రహదారి కొదురుపాక నుంచి నంది కమాన్ వరకు ఫోర్‌వే లైన్ రహదారి ఏర్పాటు చేయాలి.

– చిలివేరి బాబు, నాంపల్లి

రోడ్డుపై వెళ్లాలంటే భయంగా ఉంది



వేములవాడకు నిత్యం వెళ్తాం. ఈ రోడ్డుపై ద్విచక్ర వాహనంపై వెళ్లాలంటే భయంగా ఉంది. కరీంనగర్–సిరిసిల్ల రహదారి వాహనాల రద్దీతో ఉంటుంది. అధికారులు స్పందించి ఫోర్‌వే లైన్ ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– శ్రీధర్, రుద్రవరం

ప్రతిపాదనలు పంపించాం



కరీంనగర్–సిరిసిల్ల రహదారిలో కొదురుపాక మిడ్ మానేరు వంతెన నుంచి వేములవాడ నంది కమాన్ వరకు ఫోర్‌వే లైన్ రహదారి మిగిలి ఉంది. ఈ రహదారి కోసం ప్రభుత్వానికి గతంలోనే ప్రతిపాదనలు పంపించాం. ఇటీవల కూడా మళ్లీ పంపాం.

– శాంతయ్య, వేములవాడ ఆర్‌అండ్‌బీ డీఈ

ప్రభుత్వ కళాశాలలో ఉత్తమ ఫలితాలు



బండలింగంపల్లిలో ప్రచారం చేస్తున్న అధ్యాపకులు

ఎల్లారెడ్డిపేట: ప్రభుత్వ కళాశాలలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యనందిస్తున్నామని, ఫలితంగా వంద శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నట్లు జూనియర్ కళాశాల అధ్యాపకులు అన్నారు. పదోతరగతి పాసైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరాలని మంగళవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. బండలింగంపల్లి, సింగారం, గంభీరావుపేట మండలం గజసింగవరం, సముద్రలింగాపూర్ గ్రామాల్లో విద్యార్థుల ప్రవేశాలపై ఇంటింటా తిరుగుతూ కళాశాలలో కల్పిస్తున్న వసతులపై వివరించారు. వాసరవేణి పర్శరాములు, మాదాసు చంద్రమౌళి, చెరుకు భూమక్క, గీత, సాగర్ తదితరులున్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రుద్రంగి: మండల కేంద్రంలో బుధవారం రోడ్డు పనులు జరగనున్నందున రుద్రంగి సబ్ స్టేషన్ పరిధిలో గల రుద్రంగి, కొత్తపేట గ్రామాలకు ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని సెస్ ఇన్‌చార్జి ఏఈ మహేశ్ పేర్కొన్నారు.